క్లుప్తంగా

నేడు సీత్లా భవాని పండుగ

చెన్నారావుపేట : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ తండాలో బంజారా ప్రజలు నేడు(మంగళ వారం) సీత్లా భవాని పండుగను ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్‌ మండల యువ నాయకుడు మురళి నాయక్‌ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీత్లా భవాని పండుగ వేడుకలు ఒకే రోజు నిర్వహించి బంజారాల సంస్కృతీ, సంప్రదాయాలను చాటాలని అన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేట–మడిపల్లి గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్డు పనులను బీఆర్‌ఎస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు దామోదర్‌ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా సరైన రోడ్డు లేక రెండు గ్రామాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లానని ఆయన తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.1.62కోట్లు మంజూరు చేసి, సుమారు 2 కిలోమీటర్ల మేరబీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ యాసం బాలకృష్ణ, నాయకులు బోళ్ల భూపాల్, బరుపాటి రాజు, కదిరి సురేష్, కొయ్యడి సారయ్య, తిప్పని కర్ణాకర్, మాలలి రవి, తాళ్ల శ్రీనివాస్, రావుల ఆనందం, తిప్పని సుధాకర్, యాసం కుమారస్వామి, తిప్పని సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్‌ చదలవాడ బాబురావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.కాగా బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నిమ్మగడ్డ శ్రీనివాస్, పెద్దారావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతుల స్వైర విహారం

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలో వానరాలు స్వైర విహారం చేస్తున్నాయి. సోమవారం ఓ పాన్‌ షాపు వద్ద శీతల పానీయాలకు అలవాటు పడిన ఓ వానరం చక్కగా కూల్‌డ్రింక్‌ బాటిల్‌ను ఎత్తుకుపోయి పళ్లతో సీసా మూతను కొరికి ఏం చక్కా తాగేసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ములుక రాజయ్య (ఫైల్‌)

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ ములుక రాజయ్య(58) చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. రాజయ్య గత 35 ఏళ్లుగా పీఏసీఎస్‌ విధులు నిర్వహిస్తున్నాడు. కాగా వారం రోజుల క్రితం రాజయ్యకు గుండెపోటు రావడంతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌ తరలించే క్రమంలో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్పలీల, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా మృతదేహాన్ని సొసైటీ చైర్మన్‌ సుకినె రాజేశ్వర్‌రావు, వైస్‌ చైర్మన్‌ గుడిపెల్లి ధర్మారెడ్డి, సర్పంచ్‌ పెండ్యాల మమతారాజు, ఎంపీటీసీ నాగరబోయిన మమతామోహన్, ఉప సర్పంచ్‌ జంగా రాజిరెడ్డి, డైరెక్టర్‌ నల్ల శ్యాంసుందర్‌తో పాటు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్‌ సెంటర్‌ సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని లీగల్‌ కౌన్సిలర్‌ శ్రీదేవి, కేస్‌ వర్కర్‌ హరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఫంక్షన్‌హాల్‌లో వీఓ సభ్యులతో సఖి–వన్‌స్టాప్‌ సెంటర్‌ అందించే సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, హరిత మాట్లాడుతూ.. సర్వోదయ యూత్‌ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలుపడంతో పాటు సఖి అందించే ఐదురకాల సేవలను వివరించారు. సమస్యలు ఉన్న మహిళలకు కౌన్సిలింగ్‌ నిర్వహించడంతో పాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం సఖి కేంద్రం ద్వారా అందించబడుతుందని తెలిపారు. సఖి సేవలు 24గంటలు అందుబాటులో ఉంటాయని, బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్‌ ఫ్రీ నంబర్‌ 181కు ఫోన్‌ చేయాలని కోరారు.

కేజీబీవీలో సమస్యల తిష్ట

- ప్రహరీ లేక రక్షణ కరువు
- పిచ్చి మొక్కలు,చెట్లతో నిండిన ప్రాంగణం



వరండాలో నేలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి.. దీంతో విద్యార్థినులు అనేక అవస్థలు పడుతున్నారు.. పాఠశాలలో 320మంది విద్యార్థినులు చదువుతుండగా వారికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ కూలిపోవడంతో పాటు ప్రాంగణంలో పిచ్చి చెట్లు, మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని తొలగించలేదు. వర్షాకాలం కావడంతో పాములు, తేళ్లు వచ్చే ప్రమాదముందని విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. కేవలం భోజన సౌకర్యం బాగా ఉందని మిగతా సమస్యలతో సతమతవుతున్నామని విద్యార్థినులు చెబుతున్నారు. గతేడాది ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం ప్రారంభం కాగా విద్యాసంవత్సరం గడిచినా తరగతి గదుల్లోకి బెంచీలు లేకపోవడంతో కిందనే కూర్చుని పాఠాలు వింటున్నారు. పాఠశాల ప్రాంగణం మధ్యలో లోతు ఉండడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో ఈగలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రహరీ వెంట మురుగు కాల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. గతంలో పాఠశాల ప్రాంగణం చుట్టూ నిర్మించిన ప్రహరీ అక్కడక్కడ కూలిపోవడంతో రాత్రి పూట విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోంది. ఇంటర్మీడియట్‌ భవనం నుంచి పాతపాఠశాల భవనానికి విద్యార్థినులు భోజనానికి రావడంతో



పాఠశాల వద్ద కూలిన ప్రహరీ, చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

పాటు గదుల వరకు రావడానికి వర్షాకాలం బురదమయంగా మారి ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కొత్త భవనం నుంచి పాత భవనం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, చుట్టూ కొత్తగా ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ప్రాంగణంలో ఉన్న పిచ్చి చెట్లను, మొక్కలను తొలగించి భూమి చదును చేయాల్సిన అవసరం ఉంది. డ్రైయినేజీల నుంచి మురుగు నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ఇంటర్మీడియట్‌ విద్యార్థినులకు తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి



కేజీబీవీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే అరూరి రమేష్‌ చొరవ తీసుకోవాలి. ఇంటర్మీడియట్‌ విద్యార్థినులు తరగతి గదుల్లో బెంచీలు లేక కిందనే కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. తన సీడీఎఫ్‌ నిధుల నుంచి సాయం మంజూరు చేసి సమస్యలు తీర్చాలి

-జన్ను నర్సయ్య, వర్ధన్నపేట

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సీఏ మహిళా సంఘాలకు సంబంధించిన డబ్బులు వాడుకున్న విషయం విధితమే. దీంతో అధికారులు ఆడిట్‌ నిర్వహించగా అవకతవకలు జరిగిన విషయాన్ని గుర్తించి సంఘాలకు తిరిగి డబ్బులు చెల్లించాలని సీఏను ఆదేశించారు. దీంతో సంఘాలకు సీఏ కొంత మేర డబ్బులు చెల్లించారు. మరికొంత మొత్తంలో డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని మహిళా సంఘాల బాధ్యులు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం చేరారు. పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగే ప్రయత్నం చేశారు. మహిళా సంఘాల బాధ్యులతో ఎస్సై తిరుపతి మాట్లాడి సీఏను స్టేషన్‌కు పిలిపించారు. సంఘాలకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించి సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

లక్కపురుగులను అరికట్టాలి

ఖానాపురం : గోదాంల నుంచి వస్తున్న లక్కపురుగుల వ్యాప్తిని తక్షణమే అరికట్టాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. ఈ మేరకు మండలకేంద్రం శివారులోని గోదాంల నుంచి లక్కపురుగులు భారీగా ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఎంపీపీ సోమవారం గోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాంల ద్వారా లక్క పురుగులు ఇండ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తిండి తినలేక, రాత్రి సమయంలో నిద్రించలేకపోతున్నారన్నారు. ఉప సర్పంచ్‌ మేడిద కుమార్, నీలం సాంబయ్య, దాసరి రమేష్, గంగాపురం రాజు, శ్రీనివాస్, సుధాకర్, గంగాపురం అనిల్, నరేష్, రమేష్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్‌ నాయకులు



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని జోజిపేట నారాయణ తండాకు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు నాగోతు ఆరోగ్యం, దాసరి దిలీప్, వార్డుసభ్యులు నాగోతు జ్యోతిబాబు, నాగోతు దాసయ్య, లావుడ్య చందు, బానోత్‌ రమేష్, బానోత్‌ లచ్చులు, నాగోతు శౌరిరాజు, లావుడ్య హరిలాల్, భద్రు, శెలిబిరాజు, బాలస్వామి, గుగులోత్‌ ఈరమ్మ, హల్యతో పాటు పలు కుటుంబాలు సోమవారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌ పార్టేనని, ప్రజలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాలాయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, వర్కింగ్‌ ప్రెసిడెంట్లు సిద్దన రమేష్, తొప్పెట రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలను బలోపేతం చేయాలి



పర్వతగిరి: ఎన్నికైన సోషల్‌ మీడియా కమిటీ



నెక్కొండ: ఎన్నికైన మేరు సంఘం సభ్యులు

పర్వతగిరి : మండలంలో సోషల్‌ మీడియా, యూత్‌ కమిటీలను బలోపేతం చేయాలని సోషల్‌ మీడియా మండల కన్వీనర్‌ బొట్ల మధు, యూత్‌ నాయకుడు బూర శ్యామ్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని జమలాపురం, గోరుగుట్టతండా గ్రామాల్లో సోమవారం సోషల్‌మీడియా, యూత్‌ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జమాల్‌పురం సర్పంచ్‌ పిడుగు రేణుకసాయిలు, గోరుగుట్టతండా సర్పంచ్‌ వెంకన్న, జమాల్‌పురం గ్రామ పార్టీ అధ్యక్షుడు కొల్లూరి రవి, దేవేందర్, జంగిలి యాకయ్య, దబ్బెట నరేష్, ఒగ్గుమల్ల నవీన్, ఆకుల శ్రీధర్, వడ్లకొండ ప్రసాద్, మాసాని వెంకట్, రాపాక రాజశేఖర్, మోహన్, సుమన్, రాజేందర్‌ పాల్గొన్నారు.

బ్యాండ్‌ కళాకారుల మండల కమిటీ ఎన్నిక

నర్సంపేట రూరల్‌ : బ్యాండ్‌ కళాకారుల మండల కమిటీని గురిజాల గ్రామంలో డివిజన్‌ అధ్యక్షుడు మాడిపెద్ది వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాడిపెద్ది రాములు, ఉపాధ్యక్షుడిగా జనున బాబు, కార్యదర్శి నాగవెల్లి రమేష్, సహాయ కార్యదర్శిగా కొయ్యల జవహర్, కోశాధికారిగా మిట్టగడుపుల చిన్నరవిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

జీపీ కార్మిక మండల జేఏసీ..

తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక నర్సంపేట మండల జేఏసీని జిల్లా అధ్యక్షుడు జన్ను శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల జేఏసీ అధ్యక్షుడిగా పున్నం ఆనంద్, ఉపాధ్యక్షుడిగా నల్ల మహేందర్, కార్యదర్శిగా శనిగరం రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా ఎండీ యాకుబ్‌ పాషా, కోశాధికారిగా నర్ర కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా నర్సయ్య, శ్రీనివాస్, రమేష్, సదానందం, కుమార్, కోటి, మోహన్, రాజు, నవీన్‌ తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

మేరు సంఘం మండల కమిటీ..

నెక్కొండ : మేరు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్‌ పెండ్యాల హరిప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా కీర్తి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ గణేష్, కోశాధికారిగా గూడూరు సాంబమూర్తి, ఉపాధ్యక్షులుగా సంగ లక్ష్మణ్, తాళ్ల సంతోష్, పెండ్యాల పెరుమాండ్లస్వామి, పెండ్యాల సత్యం, సంగ వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కీర్తి సురేష్, గట్ల రమేష్, గట్ల వెంకటేశర్లు, సోమ విజయ్‌కుమార్, పెండ్యాల కుమారస్వామి, తదితరులు ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు కులస్తులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఎన్నికల పరిశీలకులుగా కీర్తి నిత్యానందం, ఎన్నికల అధికారిగా కొత్తకొండ విద్యాసాగర్‌ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాడిశెట్టి సత్యం, పెండ్యాల శ్రీనివాస్, రామగిరి సతీష్, కీర్తి రవిచంద్ర, పెండ్యాల అరుణ, గట్ల వరుణ్, సంగ రాజేష్, గట్ల లక్ష్మణ్, గట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌ గ్రీవెన్స్‌లో సమస్యల ఏకరువు

వినతులు స్వీకరించిన కమిషనర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా

వరంగల్‌ అర్బన్‌ : ఆస్తి, నీటి, చెత్త పన్నులు చెల్లిస్తున్నా కాలనీల్లో కనీస వసతులు కరువయ్యాయని ప్రజలు గ్రీవెన్స్‌ సెల్‌లో సమస్యలను ఏకరువు పెట్టారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌ హాల్‌లో సోమవారం గ్రీవెన్స్‌ సెల్‌ నిర్వహించారు. కమిషనర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 62 ఫిర్యాదులు అందగా, అందులో ఇంజనీరింగ్‌ సెక్షన్‌కు 15, హెల్త్‌– శానిటేషన్‌కు 5, పన్నుల విభాగానికి 16, టౌన్‌ ప్లానింగ్‌కు 24, తాగునీటి సమస్యపై 2 చొప్పున దరఖాస్తులు అందాయి. అడిషనల్‌ కమిషనర్లు రవీందర్‌యాదవ్, అనిసుర్‌ రషీద్, ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య, ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ రాజేష్, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్‌ వెంకన్న, బయాలజిస్ట్‌ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, జోనా, ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్‌ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి: కమిషనర్‌

గ్రీవెన్స్‌ సెల్‌కు వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా ఆదేశించారు. వింగ్‌ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ దరఖాస్తుదారుడు కార్యాలయం చుట్టూ తిరుగకుండా వేగంగా సమస్యలు పరిష్కరించాలని, ప్రతినెల 3వ శనివారం వివిధ విభాగాల అధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించాలని, ఈ–ఆఫీస్‌ ఫైళ్లు, టప్పా, యాప్‌ ద్వారా నమోదయ్యే ఫిర్యాదులపై చర్చించాలని, ప్రధాన సమస్యలపై ఫోకస్‌ పెట్టాలన్నారు. పన్ను వసూళ్లకు సంబంధించిన డిమాండ్‌ నోటీసులను బుధవారంలోగా అందజేయాలని, లేకపోతే కొరియర్‌ ద్వారా చేరవేయాలన్నారు. ఆ సమాచారాన్ని ఎస్‌ఎంఎస్‌ రూపంలో తెలియజేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి నగర పరిస్థితులపై సిటిజన్‌ ఫీడ్‌ బ్యాక్‌ తీసుకోవాలన్నారు. అందుకు మెప్మా ఎస్‌ఎల్‌ఎఫ్‌లతో, మహిళా సంఘాలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలం పూర్తిస్థాయిలో ఇంకా మొదలవలేదని పెండింగ్‌లో ఉన్న డీ–సిల్టేషన్‌ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని, టీఎస్‌ –బీపాస్‌ దరఖాస్తులను డిప్యూటీ కమిషనర్లు మానిటరింగ్‌ చేయాలని కోరారు. బీసీల రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తులను క్లియర్‌ చేయాలని, సమన్వయంతో పనిచేసి ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేశారని కమిషనర్‌ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు షురూ

ఐనవోలు : మండలంలోని పలు పాఠశాలల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 10నుంచి 16వరకు కొనసాగనున్న వారోత్సవాల్లో గ్రంథాలయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విద్యార్థులతో కథల పుస్తకాలు చదవించి వారిలో పఠనాసక్తిని పెంపొందించనున్నారు. ఈ సందర్భంగా ఉడుతగూడెం పాఠశాలలో హెచ్‌ఎం లింగారావు బ్యానర్‌ ఏర్పాటు చేసి పుస్తక పఠన ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించారు. .

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని విశ్వవాణి పబ్లిక్‌ స్కూల్‌లో 2003–04 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటి వీరప్రకాశ్, రాకేష్, కార్తీక్, నవీన్, అశోక్, భరత్, గౌతమి, బిందు, మమత, హేమలత, సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : సోషల్‌ వెల్ఫేర్‌ గర్ల్స్‌ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్‌ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుగ్గొండి మండలానికి చెందిన సోషల్‌ వెల్ఫేర్‌ బాలికల హాస్టల్‌లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చెన్నారావుపేట మండలంలో పాత ప్రైవేటు భవనంలో పాములు, తేళ్లతో రాత్రులు గబ్బిలాలు, హాస్టల్‌ మధ్యలో చెత్త కుప్పలతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ఆర్డీఓ స్పందించి సమస్యలను పరిష్కరించాల కోరారు. కార్యక్రమంలో సురేష్, అజయ్, నరేష్, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన ఉండాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట : సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శ్రీనివాస్, హెడ్‌ కానిస్టేబుల్‌ శంకరయ్య అన్నారు. సోమవారం వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌ ప్రాంగణంలో ప్రయాణికులకు సైబర్‌ నేరాలు, మూఢాచారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌ ద్వారా మీ బ్యాంక్‌ ఖాతా నిలిచిపోతుందని లేదా ఏదో లాటరీ తగిలిందని అయోమయానికి గురిచేసి పిన్‌ నంబర్‌ తెలుసుకుని మీ ఖాతా నుంచి డబ్బులు మాయం చేస్తారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు, ఇతరులకు బ్యాంక్‌ ఖాతా వివరాలు ఇవ్వవద్దన్నారు. లాటరీ పేరుతో నమ్మించి మోసం చేస్తారన్నారు. నేటి ఆధునిక యుగంలో మూఢనమ్మకాలను ఎవరు నమ్మవద్దన్నారు. అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వెళ్లాలని డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బుచ్చయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ తీగలు



వేలాడుతున్న తీగలను చూపుతున్న దేవరాజు

వర్ధన్నపేట : చేతికందే ఎత్తులో విద్యుత్‌ తీగలు వేలాడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొత్తపల్లి సమీపంలో వ్యవసాయ బావి వద్ద దామరగాని దేవరాజ్‌ వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్‌ తీగలు కిందికి వేలాడుతూ చేతికందే ఎత్తులో ఉన్నాయి. దీంతో రైతు ఈ విషయాన్ని విద్యుత్‌ అధికారులకు వారం రోజులుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



నర్సంపేట రూరల్‌: దీక్షలో కూర్చున్న జీపీ సిబ్బంది



చెన్నారావుపేటలో..

సంగెం/నర్సంపేట రూరల్‌/దుగ్గొండి/ నెక్కొండ/ రాయపర్తి/ చెన్నారావుపేట/ఖానాపురం : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి పర్మనెంట్‌ చేయాలని గ్రామపంచాయతీ కారోబార్, సిబ్బంది జేఏసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు తెలంగాణ పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆయా మండలాల్లోని జీపీల్లో పనిచేస్తున్న కారోబార్‌లు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీఓనంబర్‌ 51ని సవరించి మల్టీపర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా, గ్రాట్యూటీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జీపీ కారోబార్లు, బిల్‌ కలెక్టర్లను పంచాయతీ కార్యదర్శికి అసిస్టెంట్‌గా నియమించాలన్నారు. కారోబార్లకు నెలకు రూ.19,500లు, సిబ్బందికి రూ.15,600లు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

పకడ్బందీగా ఇక ఆన్‌లైన్‌

- ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు
- 18 పాఠశాలలకు అందజేత
- తొలగనున్న ఇబ్బందులు



ట్యాబ్‌ అందుకుంటున్న బాల్‌తండా హెచ్‌ఎం రమేష్‌(ఫైల్‌)

ఖానాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ప్రతీ వివరాలను ఆన్‌లైన్‌ చేస్తుంటారు..ఆన్‌లైన్‌ చేయడానికి మీ సేవా కేంద్రాలతో పాటు ఎమ్మార్సీ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది.. ఒక్కోసారి అసంపూర్తిగానే వివరాలు నమోదు చేసే పరిస్థితులు ఉంటాయి. ప్రతీ ఒక్క వివరాన్నీ ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయించడానికి ఆధునిక పరికరాలను పాఠశాలలకు అందజేసింది. ఖానాపురం మండలవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 18 ఉన్నాయి. ఇందులో సుమారుగా 900మంది విద్యార్థులు, 60మంది వరకు ఉపాధ్యాయులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో వివరాలను ఆన్‌లైన్‌ చేయడానికి మీసేవ కేంద్రాలు, ఎమ్మార్సీలకు వెళ్లి నమోదు చేయాల్సి ఉండేది. ఇలా అనేక ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఒక్కో పాఠశాల హెచ్‌ఎంకు ట్యాబ్‌లను అందజేశారు. ట్యాబ్‌లలో మధ్యాహ్నభోజనం, నమోదు, ప్రగతి నివేదిక, పరీక్షల ఫలితాలు, ఎస్‌ఎంసీతో పాటు పాఠశాలకు సంబంధించిన ప్రతీ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలి. గతంలో నమోదుకు సమయం వృథా అయ్యేది. కానీ ట్యాబ్‌ల ద్వారా ఆయా పాఠశాలల్లోనే ఆన్‌లైన్‌ నమోదు చేసుకునే అవకాశంతో సమయం ఆదా కానుంది.

అందని సిమ్‌కార్డులు..

వివరాలను ఆన్‌లైన్‌ చేయడానికి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు అందించారు. ట్యాబ్‌లలో నమోదు చేయడానికి ఇంటర్నెట్‌ అవసరం ఉంటుంది. ఇందుకోసం ఒక్కో ట్యాబ్‌కు సిమ్‌కార్డులను అందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సిమ్‌కార్డులు ఇవ్వకపోవడంతో పలువురు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ల ద్వారా కనెక్ట్‌ చేసి వినియోగిస్తున్నట్లు తెలిసింది. కొంత మంది వినియోగించకుండా పక్కన పెడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాబ్‌లకు సిమ్‌ కార్డులను అందించాల్సి ఉంది.

సిమ్‌కార్డులు రాలేదు

ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లను ఇప్పటికే అందజేశాం. వాటికి కావాల్సిన సిమ్‌కార్డులు ఇంకా రాలేదు. సిమ్‌కార్డులు వచ్చిన తర్వాత వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ట్యాబ్‌లకు సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

-రత్నమాల, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ, ఖానాపురం